క్లుప్తంగా

నేడు పంటల సాగుపై అవగాహన సదస్సు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పాత జాతీయ రహదారిలో గల ఎల్‌ఎస్ గార్డెన్‌లో వ్యవసాయ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వానాకాలం, పంటల సాగుకు సమాయత్తంపై నేడు(మంగళవారం) నియోజకవర్గ పరిధిలోని విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల డీలర్లకు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఏఓ నిషాంత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు విత్తన, ఎరువులు, క్రిమిసంహారక మందుల డీలర్లు, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు హాజరుకావాలని ఆయన కోరారు.

డీఎస్పీ రూపొందించిన చిహ్నాన్ని ఆమోదించాలి



తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొందుర్గు: దళిత శక్తి పార్టీ రూపొందించిన చిహ్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక చిహ్నంగా ఆమోదించాలని డీఎస్పీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం వారు జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాజముద్ర తయారీలో తమ ప్రతిపాదనను స్వీకరించాలని డీఎస్పీ నాయకులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చిహ్నం మార్పు చేసే విధానాన్ని తాము స్వాగతిస్తున్నామని, చిహ్నంలో ఉస్మానియా యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్, పండుగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, సమ్మక్క, సారలమ్మ చిత్రాలు వచ్చేలా రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గిరి, నాయకులు శ్రీను, నర్సింహ, కేశవులు పాల్గొన్నారు.
కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్పీ ప్రతిపాదించిన నమూనా చిహ్నం(రాజముద్ర)ను ఆమోదించాలని కోరుతూ సోమవారం ఆ పార్టీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నామని, డీఎస్పీ ప్రతిపాదించిన రాజముద్రను ప్రభుత్వం ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ మండల అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు మల్లేశ్, కార్యదర్శి కృష్ణ, నాయకులు నర్సింలు, కృష్ణ, నందు, శ్రీకాంత్, గణేశ్ తదితరులు ఉన్నారు.

గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి

కొందుర్గు: ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఎంఈఓ కిష్టారెడ్డి సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలు నడిపిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభమవుతాయని, బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బండి సంజయ్‌కు శుభాకాంక్షలు



బండి సంజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: బీజేపీ నాయకుడు బండి సంజయ్ పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి కేంద్ర మంత్రిగా ఎదిగారని పలువురు నాయకులు పేర్కొన్నారు. కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను సోమవారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండి సంజయ్‌కుమార్ పార్టీలో సామాన్య కార్యకర్తగా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బండి సంజయ్ కేంద్రమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ప్రతీ కార్యకర్త గర్వించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, అశోక్‌గౌడ్, వంశీకృష్ణ, నర్సింహ్మగౌడ్, చెట్ల వెంకటేశ్, మఠం రుషికేశ్, శరత్‌రెడ్డి, శంకర్ ఉన్నారు.

అల్లనేరేడు.. లాభాలు బోలెడు

- ఔషధ పోషకాల నిధి
- పలు రకాల రుగ్మతలు దూరం
- మార్కెట్‌లో మంచి డిమాండ్



అల్లనేరేడు పండ్లు

షాబాద్: తియ్యదనం, పులుపు, వగరు మేలు కలయికే అల్లనేరేడు పండ్లు. నల్లగా నిగనిగలాడే అల్లనేరేడు పండ్లను చూస్తే ఎవరికైనా నోరూరాల్సిందే. సహజ సిద్ధంగా లభించే ఫలాల్లో అల్లనేరేడు పండ్లు ప్రముఖంగా నిలుస్తాయి. ప్రకృతిలో లభించే పండ్లు ఎన్ని ఉన్నా సరే సినీ, జానపద గేయ రచయితలు మాత్రం అల్లనేరేడు పండ్లపై పాటల రూపంలో బాణీలు కట్టడం విశేషం.

పలువురికి ఉపాధి..

ప్రతీ ఏడాది ఏప్రిల్ నెలలో పూత కాత మొదలై జూన్, జూలై వరకు పండ్లు పుష్కలంగా లభిస్తాయి. చేను చెలకల్లో సహజ సిద్ధంగా దొరికే అల్లనేరేడు పండ్లతో కొందరికి మంచి ఉపాధిగా మారుతోంది.

మార్కెట్లో విరివిగా లభించే అల్లనేరుడు పండ్లకు మంచి డిమాండ్ ఏర్పడుతుంది. ఒక్క పండులోనే కాకుండా అల్లనేరుడు ఆకులు, బెరడులో కూడా మంచి ఔషధ పోషకాలు నిక్షిప్తమై ఉన్నాయని డాక్టర్లు సైతం చెబుతున్నారు. పండ్లల్లో ఆమ్లాలు, విటమిన్లు, సోడియం, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయని సెలవిస్తున్నారు. పండ్లల్లో ఐరన్ పుష్కలంగా లభిస్తుండటంతో రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా రక్తహీనతను తగ్గిస్తాయంటున్నారు. ముఖ్యంగా మధుమేహ వ్యాధిని చక్కగా నియంత్రిస్తుందంటున్నారు వైద్య నిపుణులు.

గుండె వ్యాధులు దూరం..



ఫలాల్లో చెప్పుకోదగిన పండ్లల్లో నేరేడు పండ్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. గుండె సంబంధిత వ్యాధులను నయం చేస్తాయి. రక్తపోటును నివారించడమే కాకుండా కాలేయ పనితీరును మెరుగు పరుస్తుంది. మోతాదుగా తింటే ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. అధిక మోతాదులో పండ్లను తింటే మాత్రం వెగటుగా ఉండటంతో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఎముకలకు పరిష్టిని ఇస్తుంది. – డాక్టర్ దామోదర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ

వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పాలన

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



ప్రధాని మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాబోయే ఐదేళ్లలో వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ సుపరిపాలన కొనసాగిస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో ఆదివారం ఏర్పాటు చేసిన పీఎం మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, దేపల్లి అశోక్‌గౌడ్, నర్సింహ్మగౌడ్, వంశీకృష్ణ, వెంకటేశ్, మఠం రుషికేశ్, శంకర్, శరత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలను చేపట్టడం హర్షనీయమన్నారు. గత పదేళ్లుగా బీజేపీ హయాంలో ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. భారత్‌లో రైతులు, యువత, పేదలు, మహిళల అభివృద్ధి ఎంతో కీలకమన్నారు. నిరుపేదల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ పాలన కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ హయాంలో అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి



గ్రామదేవతలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకుంటేనే మానసికంగా ప్రశాంతంగా ఉండగలుగుతారని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడలో బొడ్రాయిని ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు సోమవారం గ్రామంలో గ్రామ దేవతలతో పాటు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి, సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ ఉమాదేవిరెడ్డి, గ్రామస్తులు రాఘవేందర్ గౌడ్, జ్ఞానేశ్వర్, రవీందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- సమానత్వం కోసమే యూనిఫాం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గల మహిళా సమాఖ్య భవనంలో ఎంఈఓ శంకర్‌రాథోడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులలో అసమానతలను నిర్మూలించి అందరూ సమానంగా ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వం యూనిఫాం అందజేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, పౌష్టిక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలను తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి, ఏపీఎం నగేశ్, హెచ్‌ఎంలు రాధాకృష్ణ, బాల్‌రాజ్‌గౌడ్, వెంకటరమణ, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

నందిగామ: బడీడు పిల్లలందరినీ విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్న లత అన్నారు. మండల పరిధిలోని వీర్లపల్లిలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు, స్థానిక ఎంపీటీసీ కాట్న లత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులు, మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని, బడీడు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో బడిబయట ఉండొద్దని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కాట్న శ్రీశైలం, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు బిల్లులు అందజేస్తున్న చంద్రశేఖర్

షాబాద్: గృహజ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల విద్యుత్ బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ పథకం గతంలో అమలు కాలేదని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగియడంతో రంగారెడ్డి జిల్లాలో కూడా అమలైందన్నారు. విద్యుత్ వినియోగదారుల నుంచి గృహజ్యోతి పథకం రావడంతో సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అర్హులందరూ జీరో విద్యుత్ బిల్లులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైతాబాద్ మాజీ సర్పంచ్ పటేల్ ఖాజామీయా, గడ్డం వెంకట్‌రెడ్డి, రామస్వామి, అహ్మద్‌జానీ, మహిపాల్‌రెడ్డి, దయానంద్, జంగయ్య తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ సమస్యలు పరిష్కరించండి

మంత్రి సీతక్కకు కార్మికుల వినతి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి కార్మికులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ఉపాధి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. ‘గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమలు– సవాళ్లు’ అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కార్మికులు తరలివెళ్లారు. ఈ సదస్సుకు హాజరైన మంత్రి సీతక్కకు ఉపాధి కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్‌లను నియమించాలని, గత ప్రభుత్వ హయాంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఉపాధిహామీ కార్మికులకు ఎలాంటి కొలతలు లేకుండా రోజు కూలీ రూ.600 చెల్లించాలన్నారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కనీస పని దినాలు 200 రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీనియర్ మేట్లు కావలి ఆంజనేయులు, శంకర్, కన్న, జంగయ్య, మల్లేశ్, రమేశ్, రాజు, వ్యవసాయ, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికపై అవగాహన తప్పనిసరి

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ

కొత్తూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ అధికారులు ముందస్తుగా రైతులకు విత్తనాల ఎంపికపై తప్పనిసరిగా అవగాహన కల్పించాలని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి కోరారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. రైతులకు పంటల సాగులో అధికారులు ఇప్పటికే అవగాహన కల్పించడం సంతోషకరమన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే మంచి లాభాలు ఉంటాయన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదకరంగా మారిన స్తంభాలు, తక్కువ ఎత్తులో వేలాడుతున్న తీగలు, ఇళ్లకు సమీపంలో ఉన్న తీగలను సరి చేయాలని కోరారు. అంతేకాకుండా ఇళ్లు, ప్రధాన కూడళ్లలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలన్నారు. వరదనీరు సక్రమంగా ప్రవహించేందుకు వీలుగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రతి గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించాలన్నారు. మురుగు కాల్వల్లో నిండుతున్న చెత్త, మట్టి, పూడికను తొలగించాలని కోరారు. ముఖ్యంగా వర్షాకాలంలో రైతులు, విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సాయికృష్ణ, ఎంపీడీఓ అరుంధతి, ఏఓ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ఏఓ వెంకటేశం



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ వెంకటేశం

షాబాద్: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని యోగేశ్వరా ట్రేడర్స్, జేకే ఫర్టిలైజర్, కిసాన్ ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్‌ను పరిశీలించడంతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు సమయానికి కురుస్తున్నందున విత్తనాలు, ఎరువులు కొరత రాకుండా స్టాక్ పెట్టాలన్నారు. అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు అమ్మకూడదని, విత్తనాలు కొన్న ప్రతీ రైతుకు బిల్లు ఇవ్వాలన్నారు. రైతులకు మాయమాటలు చెప్పి కల్తీ విత్తనాలు అంటగట్టొద్దని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాల్లో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీలర్లు తదితరులు ఉన్నారు.

రైతు సమస్యలపై నిర్లక్ష్యం సరికాదు

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాధవరెడ్డి

చేవెళ్ల: రైతు సమస్యలపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించటం సరికాదని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సామ మాధవరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సోమవారం పశువైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో రైతుల పశువులు మృతి చెందుతున్నాయని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు ముందుగా మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువైద్యం సకాలంలో అందక మండలంలోని గుండాల గ్రామానికి చెందిన రైతు శ్రీరాంరెడ్డి పాడి ఆవు మృతి చెందిందని వాపోయారు. గ్రామాల్లో పశువైద్య సిబ్బంది నిర్లక్ష్యమే దీనికి కారణమని వారు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని మరోసారి ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరగకుండా చూడాలని కోరారు. వ్యవసాయ పొలాల వద్ద రైతులకు విద్యుత్ సమస్యలు అనేకం ఉన్నాయని వాటిని విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించి పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని స్తంభాలు వంగి నేలకొరిగేలా ఉన్నాయన్నారు. మండలంలోని గుండాల, చనువెళ్లి, దేవరంపల్లి, ఎర్నో కోటల, కుమ్మెర తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మాణిక్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెంటారెడ్డి, కార్యదర్శి ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.



పశు వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు

బడికి వేళాయె

- రేపటి నుంచి విద్యాసంస్థలు ప్రారంభం
- అమ్మ ఆదర్శ కమిటీలో ఏడు పాఠశాలలు ఎంపిక
- ఆయా గ్రామాల్లో పూర్తయిన మరమ్మతులు



తీగాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన టాయిలెట్స్



కొడిచెర్లతండా పాఠశాలలో కుళాయిలు, చేతులు కడుక్కోవడానికి నిర్మించిన వాష్‌బేసిన్లు

కొత్తూరు: ఈ ఏడాది విద్యా సంవత్సరం ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో అవసరమైన వసతులు, సౌకర్యాల కల్పన, చిన్న, చిన్న మరమ్మతులు పూర్తి చేశారు. కాగా కొత్తూరు మండలంలో మరమ్మతుల కోసం 7 పాఠశాలలు జెడ్పీహెచ్ఎస్ గూడూరు, వైఎంతండా, కుమ్మరిగూడ, మల్లాపూర్, తీగాపూర్, కొడిచర్ల, కొత్తూరు ప్రాథమిక పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో కొడిచర్లలో పనులు కొనసాగుతుండగా మిగిలిన ఆరు పాఠశాలలకు రంగులు వేసే పనులు మాత్రమే ఉన్నాయి.

అన్ని సౌకర్యాలు కల్పించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు, వసతులు కల్పించాలి. ముఖ్యంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్స్‌ను నిర్మించాలి. నిర్మించడంతోనే సరిపెట్టకుండా నిర్వహణకు సిబ్బందిని నియమించాలి. స్వచ్ఛమైన తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరాను కల్పించాలి.

–నరేశ్‌చారి, ఏబీవీపీ నాయకుడు

పనులు పూర్తయ్యాయి



అమ్మ ఆదర్శ కమిటీలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో ఆయా రకాల మరమ్మతు పనులు పూర్తయ్యాయి. అంతే కాకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు బడిబాట కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, వసతులు ఉంటాయని ప్రచారం చేశాం. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారు.

– కృష్ణారెడ్డి, ఎంఈఓ, కొత్తూరు